క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలపై అవగాహన

కొల్లిపర: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు తప్పని సరిగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. శనివారం స్థానిక జగనన్న 3 కాలనీల్లో హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, డ్వాక్రా గ్రూపులకు అందిస్తున్న రుణాలు గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి బద్దిగం మాధురి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకం



తెనాలిఅర్బన్: ఎన్టీఆర్ జీవితం స్ఫూర్తిదాయకమని ఆళ్ళ రాంబాబు, తాడేపల్లి సూర్యనారాయణలు పేర్కొన్నారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన వ్యక్తిత్వంపై శనివారం కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యక్తిగత జీవితం, ప్రజా జీవితంలో అన్నగా ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ప్రముఖ కూచిపూడి నృత్య గురువు పెసర్లంక వసంతదుర్గతో పాటు వక్తలను సన్మానించారు. కార్యక్రమంలో శత జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, కంచర్ల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు పూర్ణకుంభంతో స్వాగతం



తెనాలిరూరల్: వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు తెనాలి రైల్వేస్టేషన్‌లో అధికారులు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అర్ధగంట ఆలస్యంగా శనివారం సాయంత్రం 4.50 గంటలకు తెనాలి స్టేషన్‌కు రైలు చేరుకుంది. విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎం శ్రీకాంత్, ఏడీఎంఈ ఉదయ్‌భాస్కర్, స్టేషన్ మేనేజర్ తాడికొండ వెంకటరమణ, ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ మధుసూదనరావు, ఏడీఎన్ ఎ.మణికంఠ తదితర అధికారులు ప్రజలతో కలసి రైలుకు స్వాగతం పలికారు. రైలు రాకను పురస్కరించుకుని సాయంత్రం మూడు గంటల్నుంచే స్టేషన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ ముఖ్య అతిథిగా పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులను అభినందించారు.

వృద్ధులకు అల్పాహారం

తెనాలిటౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శ్రీ ఆంజనేయం ధ్యానయోగ మండలి సభ్యులు శనివారం వృద్ధులకు అల్పాహారం అందజేశారు. నిష్కామకర్మయోగంలో భాగంగా యోగ సభ్యుడు దూపుగుంట్ల రమేష్ స్వామిజీ సహకారంతో సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ గురూజీ మాట్లాడుతూ యోగ సభ్యులు ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముంతా శ్రీనివాసరావు, తాడికొండ శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, భూపతి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

తెనాలిరూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఎస్ఈబీ) అధికారులు సీజ్ చేశారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంక నుంచి అక్రమంగా ఇసుకను తెనాలి తీసుకువచ్చి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న రెండు ట్రాక్టర్లను ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, ఆయన సిబ్బంది శనివారం పట్టణంలో గుర్తించారు. రెండు వాహనాలను సీజ్ చేసి త్రీ టౌన్ పోలీసులకు అప్పగించారు. అలానే అధిక లోడుతో వెళుతున్న లారీని గుర్తించి యజమానికి రూ.10వేల అపరాధ రుసుము విధించారు.

భార్యపై భర్త దాడి

తెనాలిరూరల్: భార్యపై భర్త దాడి చేసి గాయపర్చడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన రాజేశ్వరి తనపై భర్త పుట్టి పుల్లారావు దాడి చేశాడని పోలీసులను ఆశ్రయించింది. వన్‌టౌన్ పోలీసులు కేసు శనివారం నమోదు చేశారు.

లక్ష్మీనారసింహుడికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని సుదురుపాడు గ్రామశివారులోని శ్రీలక్ష్మీనారసింహస్వామివారికి చైత్రబహుళ స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం విశేషపూజలు చేశారు. ఉదయాన్నే భక్తులు స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త సుబ్బారెడ్డి, వెంకటరమణమ్మలు పర్యవేక్షించారు.

వాడవాడల్లో విస్తృతంగా 'జగనన్నే మా భవిష్యత్'

- కొనసాగుతున్న మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం
- ప్రజల నుంచి విశేష స్పందన



15వ వార్డులో బుక్‌లెట్‌ను అందిస్తున్న ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రభాకర్, మాజీ వైస్ చైర్మన్ కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని తెనాలి పట్టణంలోని దాదాపు అన్ని వార్డులలో శనివారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్‌లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించారు. పలు వార్డుల్లో జరిగిన కార్యక్రమాల్లో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రజా మాటగా మా నమ్మకం నువ్వే జగన్ మారిందని పేర్కొన్నారు. ప్రజలే పలు సందర్భాలలో ఈవిషయాన్ని వ్యక్తం చేస్తున్నట్లు గుర్తుచేశారు. సీఎం జగన్ నవరత్నాలను రూపకల్పన చేసి, వాటిని సంపూర్ణంగా అమలు చేయటం జరిగిందన్నారు. ఎటువంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పథకాలు అందించటం సీఎం జగన్‌కే సాధ్యమైందన్నారు. అందుకే ప్రజలు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో పాటు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని కూడ బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. ప్రజల ఆదరణ చూస్తుంటే మరోసారి జగన్ సీఎం కావటం తథ్యమనే విషయం స్పష్టమవుతుందన్నారు. కౌన్సిలర్‌లు తోట రఘురామ్, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ గౌస్యా, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, గోరికపూడి నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు, కఠారి హరీష్, ఈద్గా గౌస్, పెదలంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో...

తెనాలిటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ చేపట్టిన మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి రూరల్ మండల గ్రామాల్లో శనివారం శ్రీకారం చుట్టారు.



24వ వార్డులో బుక్‌లెట్ అందజేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీ లావణ్య, గృహసారథులు



కరెవరంలో కరపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచి శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ భానుప్రసాద్

కఠవరం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా నాయకులు, గృహసారధులు, వలంటీర్లు ఇంటింటికి తిరిగి గోడలకు స్టిక్కర్లు, పోస్టర్‌ను అతికించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, గ్రామ మాజీ సర్పంచి గంపల శివనాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, కన్వీనర్ తమ్మా శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సంకురు బుజ్జిబాబు, కన్వీనర్లు పాల్గొన్నారు. మల్లెపాడు గ్రామంలో ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను తెలియజేసి అవి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గృహసారధులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు. గుడివాడలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

నా మాటలను వక్రీకరించారు

- ఇది ప్రతిపక్షాల దిగజారుడుతనానికి నిదర్శనం
- ఎవరికైనా మనోభావాలు దెబ్బ తింటే క్షమాపణ చెబుతున్నా
- ఎమ్మెల్యే కోన రఘుపతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా ఏర్పాటై సంవత్సర కాలమైన సందర్భంగా పార్లమెంటు స్థానంపై తాను చేసిన వ్యాఖ్యలను కావాలని వక్రీకరించారని, అయినప్పటికీ ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే క్షమాపణలు చెబుతున్నానని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1977 సంవత్సరంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఏర్పాటైందని తెలిపారు. పార్లమెంట్ నియోజవర్గం ఏర్పాటు క్రమంలో జేడీ శీలం తన రాజకీయ ప్రయోజనాల కోసం ఈ ప్రాంత అభివృద్ధిని నాశనం చేశారని విమర్శించారు. అయితే పార్లమెంటు స్థానం ఏర్పాటులో బాపట్ల, చీరాల, వేమూరు, రేపల్లె, అద్దంకి, పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి ఏర్పాటు చేశారని, దీంతో బాపట్ల జిల్లాకు తీవ్ర నష్టం కలిగిందని వివరించారు. అటు సంతనూతలపాడు, ఇటు పొన్నూరు నియోజకవర్గాలను వదిలేశారని, ఇవి బాపట్ల జిల్లాకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండేవని తెలిపారు. ఈ క్రమంలో జిల్లా ఏర్పాటు గురించి చేసిన వ్యాఖ్యలను ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు వక్రీకరించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎల్లప్పుడూ జిల్లా ప్రజల అభ్యున్నతి కోసమే పాటుపడతామని చెప్పారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన అధికారులు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆక్రమణలను ఇప్పటికే అధికారులు తొలగించారు. ఇప్పటంలో సురక్షిత నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ గతంలో ఉన్న పాతరోడ్‌కు మార్జిన్ వెంబడి ఉండడంతో ఆ పైపులైన్‌ను మార్చాలని ఇంజినీరింగ్ సిబ్బంది కార్పొరేషన్ అధికారులకు సూచించారు. పైపులైను పనులు పరిశీలించేందుకు డీఈ కృష్ణారెడ్డి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటంలో రూ.6 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ప్రధాన రహదారి మధ్యలో డివైడర్ ఏర్పాటుచేసి రెండువైపులా డ్రెయిన్‌లు నిర్మించనున్నామని తెలిపారు. పైపులైన్లు కూడా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ కిషోర్, వైఎస్సార్ సీపీ మండల యువజన నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం ప్రాతూరులో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని, ఇంటి పరిసరాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. అవగాహన కార్యక్రమం నిర్వహించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి. శైలజలు అభినందించారు.

రేపు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి రాక



సమావేశంలో మాట్లాడుతున్న మస్తానయ్య

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయానికి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఈ నెల 10న విచ్చేస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య తెలిపారు. ఆలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10న సాయంత్రం విశేష శోభాయాత్రగా స్వామికి పూర్ణ కుంభస్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు. 13న సాయంత్రం వరకు స్వామివారు ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి రోజు ఆరు గంటల పాటు మహా త్రిపుర సుందరీ దేవి సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పూజలు, చండీ యాగం, అనుగ్రహ భాషణం జరుగుతాయని తెలిపారు. 11న సాయంత్రం డాక్టర్ డీ.ఎస్. దీక్షిత్ రచించిన శ్రీ వేంకటాచల మహత్మ్యం గ్రంథాన్ని స్వామి ఆవిష్కరిస్తారని మస్తానయ్య చెప్పారు. సమావేశంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు, పి.ప్రభాకరరావు, కోశాధికారి లంక సూర్యనారాయణ, ఆవుల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

ఆరుగురు జూదరులు అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని రావిఅనంతవరం గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయచంద్ర వివరాల మేరకు తమకు అందిన సమాచారంతో రావిఅనంతవరం గ్రామంలో దాడులు నిర్వహించి, గ్రామంలోని పొలాలలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,100లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

పూరిల్లు దగ్ధం

కర్లపాలెం: ఓ పూరిల్లు దగ్ధమై రూ.50వేల ఆస్తి నష్టం జరిగిన సంఘటన మండల పరిధిలోని దుండివారిపాలెం పంచాయతీ అక్కిరాజుదిబ్బ కాలనీలో శనివారం చోటు చేసుకుంది. గ్రామ వీఆర్ఓ యశ్వంతి తెలిపిన వివరాల మేరకు అక్కిరాజుదిబ్బ కాలనీలో నివాసం ఉంటున్న బొలిమేర సంసోను పూరిల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంటితో పాటు వంటపాత్రలు, దుస్తులు పూర్తిగా దగ్ధమయ్యాయని ఆమె తెలిపారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని ప్రభుత్వ పరంగా సాయమందించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు.

75 మందికి కంటి పరీక్షలు

తాడేపల్లిరూరల్: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా తాడేపల్లి ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి వెలుగు పారా మెడికల్ ఆప్తాలమిక్ అధికారి వి.వి.కర్ణ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు వైద్య శిబిరంలో 75 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 15 మందికి కళ్లజోళ్లు అవసరం అని గుర్తించామని, కంటి ఆపరేషన్ నిమిత్తం తొమ్మిది మందిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని అన్నారు. ఇతర కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

మేడికొండూరు: మండల పరిధిలోని పేకాట స్థావరాలపై మేడికొండూరు పోలీసులు శనివారం మెరుపు దాడులు నిర్వహించారు. నలుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పేరేచర్ల లక్ష్మీనరసింహకాలనీలో రహస్యంగా ఒక ఇంటిలో పేకాట ఆడుతున్నారని సీఐ వాసుకి వచ్చిన సమాచారం మేరకు కానిస్టేబుల్స్ డేవిడ్, నజీర్‌లతో కలిసి పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7210 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ వాసు తెలిపారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: వేసవిలో వడదెబ్బ తగలకుండా గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పొన్నెకల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి, సుదురుపాడు పీహెచ్ సీ ఇన్‌చార్జి సాయి సిద్ధార్థరెడ్డి అన్నారు. వేములూరిపాడు గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ఎండలో తిరగకూడదన్నారు. తప్పనిసరి అయితే తలకు గుడ్డను ధరించి వెళ్లాలని సూచించారు. మంచినీరు తాగాలని వడదెబ్బ తగిలిందని భావించినప్పుడు ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల వద్ద, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో ఓఆర్ఎస్ అందుబాటులో ఉంటాయని దానిని తీసుకోవాలని సూచించారు. రక్తహీనత లేకుండా ఐరన్‌మాత్రలు వైద్యులు సూచించిన విధంగా వేసుకోవాలన్నారు.

విజయదుర్గా ఆలయంలో పూర్ణాహుతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విజయదుర్గా ఆలయం వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాలతో అర్చకులు వి.రాజేంద్రశర్మ అభిషేకాలు నిర్వహించి పలురకాల పుష్పాలతో విశేష అలంకారం చేశారు. యాగశాలలో చండీహోమం, రుద్రహోమాలను వేదపండితులు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సామాజిక కార్యకర్త శేషమ్మకు సన్మానం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో భారతీయ జనతాపార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా నిర్మాణ దివస్ కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ అధ్యక్షులు కాకుమాను భాగ్యేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంఘ సేవకురాలు, సామాజిక కార్యకర్త మున్నంగి శేషమ్మను సత్కరించామని, ఈమె ఎన్నో సంవత్సరాలుగా సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తూ, పలుచోట్ల భజన బృందాలను తయారు చేస్తూ, కోలాటాలను నేర్పుతున్నారని అన్నారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు టంకశాల ఈశ్వర్‌నాయుడు, చేకూరి శ్రీనివాసరావు, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



దేవస్థానంలో అమ్మవారికి తలంబ్రాలు పోస్తున్న గాదె ఆదిరెడ్డి దంపతులు

వల్లభాపురం(కొల్లిపర): మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని సర్విరెడ్డి పేరంటాలమ్మ దేవస్థానంలో అమ్మవారి కల్యాణం మహోత్సవం, పేరంటాలమ్మ తిరునాళ్ల మహోత్సవాలు గ్రామంలో మూడు రోజులుగా భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. తిరునాళ్లకు శుక్రవారం ఆఖరి రోజు కావటంతో మండలంలోని అనేక గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబసభ్యులతో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మొదటి రోజున అమ్మవారి కల్యాణ మహోత్సవంలో గాదె ఆదిరెడ్డి దంపతులు పీటల పై కూర్చుని కల్యాణ మహోత్సవం నిర్వహించారు. శిడిమాను మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పేరంటాళ్లమ్మ అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆలయంలో పేరంటాలమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్లలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆర్. రవీంద్రరెడ్డి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమాధుల తోట ప్రహరీకి రూ.10లక్షల మున్సిపల్ నిధులు

మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్



సమాధుల తోటను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, హరీష్

తెనాలిఅర్బన్: గురవయ్య కాలనీలోని క్రైస్తవుల సమాధుల తోట ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షలు మున్సిపల్ నిధులను వెచ్చించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ హామీ ఇచ్చారు. శనివారం ఆమె గురవయ్య కాలనీలోని సమాధుల తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈస్టర్ పండుగ సందర్భంగా సమాధులతోటలోని పిచ్చిమొక్కలను తొలగించినట్లు తెలిపారు. ఈస్టర్ రోజున క్రైస్తవులు తమ పూర్వీకులను గుర్తు చేసుకోవడంతో పాటు వారి సమాధుల వద్ద పలు కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ 13వ వార్డు నాయకులు కఠారి హరీష్, కడియం నాగేశ్వరరావు, బుచ్చు రాఘవరావు, దూదిబండ్ల సాయి, గోపి ఉన్నారు.

ఉత్సాహంగా 'రన్ ఫర్ జీసస్'



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న క్రైస్తవ నాయకులు

బాపట్ల అర్బన్: రన్ ఫర్ జీసస్ కార్యక్రమం బాపట్ల ఐక్య క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో విజయవంతంగా జరిగింది. సూర్యలంక రోడ్డు నుంచి మొదలైన ఈ పరుగు ఆర్ట్స్ కాలేజీ మీదుగా సాగుతూ సీబీజడ్ చర్చి వద్ద పాస్టర్ల ప్రార్థనతో ముగిసింది. నిర్వాహకుడు ఎఫ్‌డబ్ల్యూ కోల్ మాట్లాడుతూ ఏసు కొరకు పరుగు ముఖ్య ఉద్దేశం ఆయన ప్రపంచ మానవాళి కొరకు ప్రాణం పెట్టి మరణం జయించి తిరిగి లేచాడని, ప్రతి ఒక్కరికీ తెలియజేయడం, క్రైస్తవ సమాజ ఐక్యతను లోకానికి బహిర్గతం చేయటం, క్రైస్తవ నాయకత్వాన్ని బలోపేతం చేయడం, డినామినేషన్ బేధాలు లేని సార్వత్రిక క్రైస్తవ సంఘాన్ని సిద్ధపరచడం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత పట్ల యువతను చైతన్యం పరచడం అని వివరించారు. జాన్ వెస్లీ, డి.జాన్సన్, గేర మణిభూషణ్, లెఫ్టినెంట్ కల్నల్ గేరా థామస్, డాక్టర్ రెవరెండ్ జయపాల్, పాస్టర్ నోవా, రెవరెండ్ సునీల్ బాబు, సంఘ కాపరులు, సంఘస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఐరన్ మాత్రలు ఇవ్వాలి

నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎన్‌హెచ్‌ఎం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్

మంగళగిరి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనతతో బాధపడే వారిని గుర్తించి ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని నేషనల్ హెల్త్ మిషన్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ సీహెచ్ రత్నమన్మోహన్ అన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన గర్భిణులు, చిన్నారులకు, బాలింతలకు పౌష్టికాహారంతోపాటు రక్తహీనతతో బాధపడే వారికి ఐరన్ ట్యాబెట్లు, సిరప్‌లను క్రమం తప్పకుండా అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం అదే ప్రాంతంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి అమలు చేయడం జరుగుతుందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం వినియోగించుకునే విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. 30 సంవత్సరాలు దాటిన వారికి బీపీ, షుగరు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ వి రాజేష్, ఆరోగ్య విస్తరణాధికారి కె లక్ష్మీమనోహర్‌ల తోపాటు పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



సేవా సంస్థల ఆధ్యాత్మిక కన్వీనర్ కృష్ణవేణి, కర్లపాలెం సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు తుమ్మల శ్రీనివాసరావు, విద్యార్థులు ఉన్నారు.

కర్లపాలెం: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై ధ్యాస పెట్టగలరని సత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి గుంటూరు జిల్లా కన్వీనర్ జాలాది సీతారామయ్య తెలిపారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు శనివారం కర్లపాలెం ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ గోవింద్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే విద్యార్థులందరికీ సత్యసాయి సేవా సమితి తరపున పాదరక్షలు పంపిణీ చేశారు.

బీసీలకు సముచితస్థానం కల్పించాలి

ఐలవరం(భట్టిప్రోలు): జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. శనివారం వేమూరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా భట్టిప్రోలు మండలం ఐలవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడిగా జొన్నాదుల వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఈడే శ్రీనివాసరావులకు నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా న్యాయ సలహాదారుడు నటరాజన్, బాపట్ల, వేమూరు నియోజకవర్గ, యువజన అధ్యక్షులు పిన్నిబోయిన వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌పీ రాజు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో ఈ నెల 10వతేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ఆధ్వర్యంలో విజయవాడ అను మైబేబీ కేర్ ఆసుపత్రి వారిచే తల్లి–బిడ్డల ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లి, బిడ్డలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.